భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

**కథ**

# 'సమస్య'

శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

నేను లేచేను. నాతో పాటే నా సమస్యలూ లేచాయి. నా మనసు చివుక్కుమంది. నేను సమస్యల్నుండి దూరంగా పారిపోలేక పోతున్నాను. అలాగని సమస్యల్ని పరిష్కరించుకోలేను. సమస్యల్ని తల్చుకుని బాధపడకుండా వుండలేను. పొద్దున్న లేచేసర్కి ఆరయింది. ఆరయింది అంటే బాగా ఆలస్యం అయినట్టు లెక్క. నాలో భయం, టెన్షన్ మొదలయ్యాయి. నాకు షుగరు, బి.పి. హార్ట్ ప్రోబ్లం అన్నీ వున్నాయి. రోజూ ఉదయం లేవగానే తేలికపాటి వ్యాయామాలు చెయ్యాలని అనుకుంటాను. అయిదుకి లేస్తేనే వీలవుతుంది. ఆరయితే కోడలికి వంటపనిలో సాయం చెయ్యాలి. ఆలస్యంగా లేస్తే వ్యాయామం చెయ్యడం కుదరదు. నేను వ్యాయామం చేస్తూ కూర్చుంటే కోడలు కొడుక్కి కంప్లెయింట్ ఇచ్చేస్తుంది. వాడొచ్చి 'అమ్మా ! ఈ వయసులో నీకు ఈ వ్యాయామాలు అంత అవసరమా చెప్పు ?! పాపం అదొక్కర్తీ వంటింటి పనితో నలిగిపోతున్నది. వెళ్లి సాయం చెయ్యొచ్చుకదా." అంటాడు. వాడు నెమ్మదిగా అన్నా ఆ మాట నామనసుకి గుచ్చుకుని నాలో గిల్టీ ఫీలింగు" మొదలవుతుంది! ఎవరేమన్నా అంటే మనసులో విపరీతంగా బాధ పడిపోతాను. కళ్లంట నీళ్లొస్తాయి!

'పద. వెళ్లిపోదాం ఇక్కడ్నుంచి " అంటా రాయన.

సమాజం- సభ్యత ఇవన్నీ అడ్డొస్తాయి! ఎక్కడికి వెళతాం? ఎన్నాళ్ళుంటాం? వృద్ధాప్యంలో తల్లిదండ్రులు కొడుకు దగ్గర వుండడం సమాజ ధర్మం. లోపలి లొసుగులు ఎన్ని వున్నా పైకి 'మాకేం తక్కువ! హాయిగా వున్నాం' అని ముఖానికి 'నవ్వు' ముసుగువేసుకుని తిరిగేస్తాం.

నాన్నా! కొత్త ప్లాటు కొనాలని వుంది. ముప్పయి లక్షలు పెట్టందే ప్లాటు రాదు. అదే ఆలోచిస్తున్నాను' అన్నాడు నరేంద్ర ఒకరోజు ఆయనతో మాట్లాడుతూ, మాటల మధ్యలో.

'కొనరా డబ్బుగురించి ఆలోచించకు. నేనున్నాను కదా. రిటైర్‌మెంటు బెనిఫిట్స్ నావి ఇంటి మీద పెట్టేద్దాం. అద్దెకొంపల్లో ఎన్నాళ్ళుంటారు. చెప్పు? ఆలస్యం చేస్తే మంచివన్నీ బుక్ అయిపోతాయి' అన్నారాయన నిండు మనసుతో. నరేంద్ర ఆ విధంగా తన పేరు మీద తండ్రి డబ్బుతో ఫ్లాటు కొన్నాడు. కొడుక్కి స్వంత ఇల్లు కుదిరినందుకు ఆయన చాలా సంతోషించారు.

"నారాయణమూర్తి కొడుకు ప్లాటు కొన్నాడట' బంధువులనోళ్ళలో ఆ మాట నానింది. ఇద్దరు ముగ్గురు అడిగితే, నేనూ, నాపెళ్లాం ఇద్దరం వుద్యోగాలు చేసుకుంటున్నాం. డబ్బు వెనకేసుకున్నాం. అందుకే కొత్తఫ్లాటు కొనగల్గాను' అన్నాడు నరేంద్ర. కాని తండ్రి డబ్బుతో కొన్నానని ఎవరికి చెప్పలేదు. నామోషి అడ్డొచ్చింది! ఆ మాటే ఆయనతో అంటే,

'పోనీలేవే. వాడు పరాయివాడా చెప్పు! మన కొడుకేకదా. వాడి సంతోషం మన సంతోషం కాదు?! అని సర్దిచెప్పేరు ఆయన.....

ఉదయం లేచేక కోడలు ఆఫీసు కెళ్లే ప్రయత్నంలో వుంటుంది. పిల్లలకి లంచ్ బాక్సులు రెడీ చెయ్యడం, అందరికీ బ్రేక్‌ఫాస్టు తయారు చేసి టేబుల్ మీద పెట్టడం తర్వాత వంటపన్లు క్షణం తీరిక లేకుండా అయిపోయింది నాబ్రతుకు, ఇంక వ్యాయామాలకి సమయం ఎక్కడుంది? తొమ్మిదయ్యే సర్కి కొడుకు- కోడలు ఆఫీసులకి, మనవలు స్కూలుకి వెళ్ళిపోయాక ఇల్లునిశ్శబ్దం అయిపోతుంది. నిశ్శబ్ద సంగీతంలా ఎవరి పనుల్లో వాళ్ళం నిమగ్నమైపోతాం. మాటలు మొదలుపెడితే మనసుని బాధపెట్టే ప్రస్తావనలు మాటలమధ్య చోటు చేసుకుంటాయని ఇద్దరికీ భయమే. ఆయనకి పేపరు. టివి. వుంటే చాలు ప్రపంచం అక్కర్లేదు. నేను షుగరు పేషెంటుని. టైంకి తినకపోతే ఎన్నో లంఖణాలు చేసిన దానిలా నీరసం వచ్చేస్తుంది! అయినా ఇంటిపన్లు, వంటపన్లు తప్పడంలేదు. నేను ఎన్ని పన్లు చేస్తున్నా ఏదో ఒక మిషపెట్టుకుని కోడలు నా మీద విసుక్కుంటూనే వుంటుంది. ప్రతీదానికీ సణుగుతూనే వుంటుంది!

నిన్న ఉదయం బాత్‌రూంలో కాలుజారిపడ్డాను. కాలుబెణికింది. హాస్పిటల్‌కి తీసుకెళ్లడానికి ఎవరికీ టైములేదు! ఇవాళ బాగా నొప్పి చేసింది. కాలు కింద పెట్టలేకపోతున్నాను. పడుకునే వున్నాను. నా కూతురు పద్మజకి నా సంగతి తెల్సి నిన్న గోదావరిలో బయలుదేరి నన్ను చూడ్డానికి వచ్చింది. స్టేషనుకి వెళ్లడానికి ఎవరికీ తీరుబాటు లేదు. పాపం అది ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. మా కోడలు కాఫీ కూడా ఇవ్వలేదు. పైగా సణుగుడు మొదలెట్టింది. 'ఇంట్లో ఎంత పొద్దెక్కినా లేవరు. ఏదో కొంప అంటుకుపోయినట్టు నాటకాలు! పని ఎగ్గొట్టడానికి ఇదొక మిష. సిగ్గు లేకపోతే సరి. ఏళ్ళు వస్తే సరా! ఎవరికి తప్పినా నాకు తప్పదు కదా. పొద్దున్నించి పన్లు చేసీ చేసీ వళ్ళు పులిసిపోతున్నాది. అయినా వీళ్ళే అనుకుంటే ఈవిడ్ని చూడ్డానికి తగుదునమ్మా అంటూ ఆవిడ వచ్చేయాలా!? ఈ అడ్డమైన వాళ్ళందరికీ వండి పెట్టడానికి నేనేం వంట మనిషిని కాను' అందరికీ వినపడేలా గట్టిగా అరుస్తున్నది వంటింట్లోంచి. అన్నీ అందరూ వింటున్నారు. ఎవరూ కిక్కురుమనలేదు.

'ఏంటమ్మా! వదిన అంతలేని మాటలంటున్నది' పద్మజ బాధగా అంది.

'ఊరుకో పద్మజా! దాని నోట్లో నోరు పెట్టలేం. కాలం మారిపోయిందమ్మా. ఇప్పుడు ఈ తరం వాళ్ళకి మా తరం వాళ్ళు అక్కర్లేదు . అంతే!'

'నా దగ్గరకి వచ్చి అమ్మా! ' ఏదో మాట వరసకి అంది. కాని దాని సంసారం దానిది. పెనం మీంచి పొయ్యిలో పడినట్టు అవుతుంది. పద్మజ సాయంత్రం గోదావరి వెళ్ళిపోయింది.

'నాకు చచ్చిపోవాలని వుందండి' నాలుగు రోజుల తర్వాత ఆయనతో అన్నాను బాధపడుతూ.

'ఏ సమస్యకైనా చావు పరిష్కారం కాదు శారదా! మనం మరో చిన్న ఇల్లు అద్దెకి తీసుకుని వెళ్లిపోదాం. నువ్వు బాధపడకు. నీకు నేనున్నాను." అన్నారాయన!!!